క్లుప్తంగా

కోతుల బెడద లేకుండా చర్యలు


బోనులో కోతులు

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలో గత కొంతకాలంగా కోతులు, కుక్కలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో పరిస్థితి గమనించిన డీపీఎల్‌వో ఉమర్ హుస్సేన్, పంచాయతీ కార్యదర్శి వంశీకృష్ణ వాటిని పట్టుకునేందుకు చర్యలు ప్రారంభించారు. దీనిలో భాగంగా నెల్లూరు నుంచి ప్రత్యేకంగా ఒక బృందాన్ని రప్పించినట్లు వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వంశీకృష్ణ మాట్లాడుతూ సోమవారం 170 కుక్కలను, 216 కోతులను పట్టుకున్నట్లు తెలిపారు. పట్టుకున్న కుక్కలు, కోతులను అడవిలో వదిలిపెడుతున్నట్లు పేర్కొన్నారు.

మాదిగల విశ్వరూప మహాసభ జయప్రదం చేయాలి

కాగజ్‌నగర్‌టౌన్: హైదరాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్‌లో నవంబర్ 18న నిర్వహించ తలపెట్టిన మాదిగల విశ్వరూప మహాసభను జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు కె.బ్రహ్మయ్య కోరారు. సోమవారం స్థానికంగా మహాసభలకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు.

గ్రామాల్లో పోలీసుల కవాతు


అడెపల్లిలో మాట్లాడుతున్న ఎస్సై వెంకటేష్

చింతలమానెపల్లి: మండలంలోని ఆడెపల్లి, డబ్బా, బాబాసాగర్, ఖర్జెల్లి గ్రామాలలో సోమవారం పోలీసులు కవాతు నిర్వహించారు. ఎన్నికల నేపథ్యంలో గ్రామాలలో శాంతిభద్రతల రక్షణపై అవగాహన కల్పించేందుకు కవాతు నిర్వహించినట్లు ఎస్సై వెంకటేష్ తెలిపారు. ఎన్నికల నిబంధనలు ప్రతి ఒక్కరూ పాటించాలని ఎస్సై పేర్కొన్నారు.

బహుజన రాజ్యమే లక్ష్యం


పార్టీలోకి ఆహ్వానిస్తున్న సిడాం గణపతి

కౌటాల: రాష్ట్రంతో పాటు సిర్పూర్‌లో బహుజన రాజ్యమే బీఎస్పీ అంతిమ లక్ష్యమని బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి సిడాం గణపతి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో పలువురు యువకులు పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిర్పూర్‌లోని అరాచక పాలన అంతం చేయడమే లక్ష్యమన్నారు. కార్యక్రమంలో పార్టీ అధ్యక్షుడు నాగపూరే బండు, నాయకులు దుర్గం వెంకటేశ్, సాయినాథ్, ఖాలీం పాషా, రుషి, ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

'పది రోజులు సెలవులు ఇవ్వాలి'

జైనూర్: ఆదివాసీలు పది రోజుల పాటు నిర్వహించే ఏత్మాసూర్ దండారీ ఉత్సవాల నిమిత్తం పాఠశాలలకు ప్రభుత్వం పది రోజుల పాటు సెలవులు ప్రకటించాలని మార్లవాయి రాయిసెంటర్ సార్మేడి జుగ్నక దేవురావు అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆదివాసీలు ఎంతో ఉత్సాహంగా నిర్వహించే దండారీ ఉత్సవాలకు భోగి నిర్వహించిన రోజు నుంచి చివరి రోజు నిర్వహించే కొలాలబోడి వరకు సెలవులు ప్రకటించాలని పేర్కొన్నారు. మెస్రం బాదిరావు, ఆత్రం మక్కుర్‌షావు, ఆత్రం ఆనంద్‌రావు తదితరులు ఉన్నారు.

భీం వర్ధంతిని విజయవంతం చేయండి

నార్నూర్: మండల కేంద్రంలో నవంబర్ 2న నిర్వహించే కుమురం భీం వర్ధంతిని విజయవంతం చేయాలని ఐటీడీఏ పాలక మండలి డైరెక్టర్ మాడవి మాన్కు కోరారు. సోమవారం మండల కేంద్రంలోని కుమురం భీం చౌక్ వద్ద మాట్లాడారు. ఆదివాసీ గిరిజనుల హక్కుల సాధన కోసం పోరాటాలు చేయాల్సిన అవసరం ఉందన్నారు.

దుండగులను కఠినంగా శిక్షించాలి

ఎదులాపురం: ఉట్నూర్ మండలం దొంగచింత గ్రామ పంచాయతీ పరిధిలో ఆదివాసీ అమ్మాయిపై అత్యాచారం చేసి, హత్య చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర కార్యదర్శి పూసం సచిన్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఆదివాసీ మహిళలు, బాలికలపై రోజురోజుకూ దాడులు, హత్యలు పెరుగుతున్నాయన్నారు. అయినా.. ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు.

ఓటు నమోదుకు చివరి అవకాశం

- నేటితో ముగియనున్న గడువు
- జిల్లాలోని ఓటర్లు 4,47,634
- 18 ఏళ్లు నిండిన వారికి ఓటు హక్కు



కౌటాల: రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ జిల్లాలోని రెండు నియోజకవర్గాల్లో ఎన్నికల హడావుడి ప్రారంభమైంది. ఈ నేపథ్యంలో ఎన్నికల్లో ఓటు హక్కు కోసం చివరిగా అర్హులైన వారి నుంచి ఎన్నికల సంఘం దరఖాస్తులను ఆహ్వానిస్తోంది.

జిల్లాలో 4,47,634 మంది ఓటర్లు

జిల్లాలో సిర్పూర్(టి), ఆసిఫాబాద్ రెండు నియోజకవర్గాలు ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా 4,47,634 మంది ఓటర్లు ఉన్నారు. ఆసిఫాబాద్ నియోజకవర్గంలో 1,11,878 మంది పురుష ఓటర్లు ఉండగా, 1,12,766 మహిళ ఓటర్లు ఉన్నారు. అంటే 888 మంది మహిళా ఓటర్లు అధికంగా ఉన్నారు. సిర్పూర్ నియోజకవర్గంలో పురుషులు 1,11,924 కాగా మహిళా ఓటర్లు 1,11,039 ఉన్నారు. ఈ ఏడాది జనవరిలో విడుదల చేసిన తుది ఓటరు జాబితాను పరిశీస్తే.. కొత్తగా 16,388 పెరిగారు. వివిధ కారణాలతో 11,030 మంది ఓటర్లను తొలగించారు. కాగా రెండు నియోజకవర్గాల్లో ఐదేళ్లలో ఓటర్ల సంఖ్య భారీగా పెరిగింది. 2018 డిసెంబర్ 7న జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మొత్తం 3,77,245 ఓటర్లు ఓటుహక్కు నమోదు చేసుకున్నారు. తాజా ఓటర్ జాబితా 4,47,634 మంది ఓటర్లు నమోదయ్యారు. గత ఎన్నికలతో పోల్చితే కొత్తగా 70,119 మంది పెరిగారు. గత ఎన్నికలకు ఈ ఎన్నికలకు 70 వేలకు పైగా ఓట్లు పెరిగాయి.

నేడు చివరి తేదీ

నవంబర్ 30వ తేదీన జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో ఓటు వేయాలంటే ఓటు హక్కు నమోదు కోసం ఒక్కరోజే గడువు ఉంది. అక్టోబర్ 31వ తేదీ నాటికి 18 ఏళ్లు నిండిన వారంతా ఈ నెల 31లోపు ఓటరుగా నమోదు చేసుకునేందుకు ఎన్నికల సంఘం చివరి అవకాశం కల్పించింది. అక్టోబర్ 4వ తేదీన ఎన్నికల సంఘం ఓటర్ తుది జాబితాను ప్రకటించగా మరోసారి ఎన్నికలకు ముందు మరోసారి చివరిగా ఓటు నమోదుకు అవకాశం ఇచ్చింది. దీంతో ఆయా కళాశాలల్లో, గ్రామాల్లో అధికారులు ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. దీంతో ఇప్పటి వరకు రెండు నియోజకవర్గాల్లో కొత్తగా 8009 మంది ఓటు హక్కు కోసం దరఖాస్తులు చేసుకున్నారు. ఆసిఫాబాద్ నియోజకవర్గం నుంచి 2219 మంది, సిర్పూర్ నుంచి 2790 మంది దరఖాస్తులు చేసుకోగా అత్యధికంగా ఆన్‌లైన్‌లోనే దరఖాస్తులు చేసుకున్నట్లు అధికారులు చెబుతున్నారు. మళ్లీ కొత్తగా దరఖాస్తు చేసుకున్న వారి అనుబంధ జాబితాలు రూపొందించి తుది ఓటరు జాబితా రూపొందించనున్నారు. నేటితో ఓటు నమోదుకు గడువు ముగుస్తుండడంతో మరికొన్ని ఓట్లు పెరగనున్నాయి.

ఆన్‌లైన్‌లో..

మారుతున్న కాలానికి అనుగుణంగా ఎన్నికల సంఘం ఓటు నమోదు ప్రక్రియలో మార్పులు చేసింది. గతంలో మాదిరి కాకుండా ఇప్పుడు ఇంటి వద్ద నుంచే ఓటుకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఎన్నికల సంఘం వెబ్‌సైట్ (www. ceo. telangana. gov. in) లో ఓటరుగా దరఖాస్తు చేసుకోవచ్చు.

నియోజకవర్గాల వారీగా ఓటర్ల వివరాలు

నియోజకవర్గం	పోలింగ్ కేంద్రాలు	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
సిర్పూర్	293	1,11,924	1,11,039	10	2,22,973
ఆసిఫాబాద్	304	1,11,878	1,12,766	17	2,24,661

యువత వినియోగించుకోవాలి



ఎన్నికల కమిషన్ ఇచ్చిన అవకాశాన్ని వినియోగించుకొని 18 ఏళ్లు నిండిన యువతీ, యువకులు ఓటు హక్కు నమోదు చేసుకోవాలి. ఓటు నమోదుకు నేడే చివరి తేది. ఆన్‌లైన్‌తో పాటు ఆఫ్‌లైన్‌లో ఓటు నమోదుకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఎలాంటి సందేహాలున్న బీఎల్‌వోలు, తహసీల్దార్ కార్యాలయంలో సంప్రదించాలి.

– కిరణ్‌కుమార్, తహసీల్దార్, కౌటాల

విద్యార్థులకు అభ్యాస దీపికలు పంపిణీ


పంపిణీ చేస్తున్న ఎస్‌వో శ్రీనివాస్

ఆసిఫాబాద్‌రూరల్: పదో తరగతి విద్యార్థులు అభ్యాసన దీపికలను సద్వినియోగం చేసుకోవాలని ఎస్‌వో శ్రీనివాస్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులకు పుస్తకాల మేనేజర్ సత్యనారాయణతో కలిసి అభ్యాసన దీపికలను అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులకు డిసెంబర్ 31వ తేదీ లోపు సిలబస్ పూర్తి చేయాలన్నారు. ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికతో రూపొందించిన ఈ లక్ష్యం అభ్యాస దీపికల ద్వారా విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని పేర్కొన్నారు. పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించి జిల్లాలో మంచి ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు బాధ్యత తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ ధర్మయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవం


జెండా ఎగురవేస్తున్న అధ్యక్షుడు స్వామి

రెబ్బెన: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్నాయని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ అన్నారు. మండలంలోని గోలేటి ఎక్స్‌రోడ్ వద్ద సోమవారం సింగరేణి కోల్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఏఐటీయూసీ 104వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. యూనియన్ అధ్యక్షుడు స్వామి ఏఐటీయూసీ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉపేందర్ మాట్లాడుతూ 1920లో ముంబాయ్‌లో ఆవిర్భవించిన ఏఐటీయూసీ నాటి నుంచి నేటి వరకు కార్మిక, కర్షకుల హక్కుల కోసం అలుపెరగని పోరాటాలు సాగిస్తోందన్నారు. దేశానికి పూర్తి స్వాతంత్ర్యం కావాలని బ్రిటీష్ ప్రభుత్వంపై ఎన్నో పోరాటాలు, త్యాగాలు చేసిందన్నారు. కార్మికుల హక్కులను సాధించడంలో దేశంలో మొట్టమొదటి కార్మిక సంఘం ఏఐటీయూసీ మాత్రమేనని పేర్కొన్నారు. కార్మికులు అనేక పోరాటాలతో సాధించుకున్న 44 కార్మిక చట్టాలను యధావిధిగా కొనసాగించాలని తెలిపారు. సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికలను వెంటనే నిర్వహించాలని కాంట్రాక్టు కార్మికులకు సైతం కార్మిక సంఘాల ఎన్నికల్లో ఓటు హక్కుతో పాటు సింగరేణి లాభాల్లో వాటా ఇవ్వాలని డిమాండ్ చేశారు. కోల్ ట్రాన్స్‌పోర్ట్ కార్మికులకు కనీస వేతనాలు, ఈఎస్ఐ, పీఎఫ్, కార్పొరేట్ వైద్య సదుపాయం కల్పించాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి గౌస్, వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుపతి, ఉపాధ్యక్షులు లచ్చన్న, రవి ప్రసాద్ గౌడ్, సంయుక్త కార్యదర్శి కృష్ణ, కోశాధికారి సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ప్రారంభం


పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న శ్రీనివాస్

దహెగాం: మండల కేంద్రంలో సోమవారం సిర్పూర్(టి) నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రావి శ్రీనివాస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం మండల కేంద్రంలో ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ ఆరు గ్యారంటీ పథకాల గురించి ఓటర్లకు వివరించారు. రానున్నది కాంగ్రెస్ ప్రభుత్వమేనని ధీమా వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ హయాంలో నియోజకవర్గం అభివృద్ధి జరగలేదన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎల్క మోహన్, తోగయ్య, గండె వెంకటేశ్, రవి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

బెజ్జూర్: సిర్పూర్ నియోజకవర్గంలో హస్తం పార్టీకి ఓటు వేసి రావి శ్రీనివాస్‌ను ఆదరించాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బుస శంకర్ కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం మండలంలోని పాపన్నపేట, తలాయి, సామిని, మొగవెల్లి గ్రామాల్లో పర్యటించారు. ఆయన వెంట పార్టీ నాయకులు రాజారామ్, అరుణ్ ఉన్నారు.

'అవకాశం ఇస్తే అభివృద్ధి చేసి చూపిస్తా'


పార్టీలోకి ఆహ్వానిస్తున్న అజ్మీరా శ్యాంనాయక్

రెబ్బెన: ఒక్క అవకాశం ఇస్తే అభివృద్ధితో వెనుకబడిన ఆసిఫాబాద్‌ను అభివృద్ధి చేసి చూపిస్తానని కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి అజ్మీరా శ్యాం నాయక్ అన్నారు. సోమవారం మండలంలోని నంబాల, నారాయణపూర్, కిష్టాపూర్, జక్కులపెల్లి గ్రామాల్లో పర్యటించి అక్కడి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ తాత్కాలిక సంతోషం కలిగించే పథకాలను అమలు చేసి ప్రజలను మభ్యపెడుతున్న బీఆర్ఎస్ రాష్ట్రాన్ని అప్పులు కుప్పగా మార్చిందన్నారు. అడ ప్రాజెక్టు ప్రమాదంలో ఉన్నా పట్టించుకునే నాథుడే లేకుండా పోయాడని పేర్కొన్నారు. ఎన్నో గ్రామాలకు నేటికీ కనీస రోడ్డు సౌకర్యం లేకపోవటం బాధాకరమని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఒక్క అవకాశం ఇవ్వాలని కోరారు. పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరగా వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మండల అధ్యక్షుడు రమేశ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దేవాజీ, మహిళ అధ్యక్షురాలు పద్మ, నాయకులు ఆనంద్, మురళీ, మల్లారెడ్డి, సునానీ పద్మ తదితరులు పాల్గొన్నారు.

డీఏ చెల్లింపునకు సింగరేణి హామీ

రెబ్బెన: సింగరేణి కార్మికులకు అక్టోబర్ నెల జీతంతో డీఏను చెల్లించేందుకు సింగరేణి హామీ ఇచ్చినట్లు టీబీజీకేఎస్ బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు మల్రాజు శ్రీనివాస్ రావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బొగ్గు గని కార్మికులకు సెప్టెంబర్ నెల జీతంతో డీఏ 13.6 శాతం చెల్లించాలని వచ్చిన సర్క్యులర్‌ను సింగరేణి యాజమాన్యం అమలు చేయలేదని తెలిపారు. సింగరేణి నిర్లక్ష్యం మూలంగా కార్మికులకు తక్కువ వేతనం రావటంతో పాటు రిటైర్డ్ కార్మికులకు వచ్చే రిటైర్‌మెంట్ బెనిఫిట్స్‌పై కూడ ప్రభావం పడే అవకాశం ఉందన్నారు. టీబీజీకేఎస్ అధ్యక్షుడు వెంకట్రావ్, ప్రధాన కార్యదర్శి మిర్యాల రాజిరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ కెంగర్ల మల్లయ్యలు అక్టోబర్ నెల జీతంతో సెప్టెంబర్ నెల డీఏను సైతం కలిసి చెల్లించే విధంగా యాజమాన్యంతో చర్చించగా డీఏ చెల్లింపునకు సింగరేణి సంస్థ హామీ ఇచ్చినట్లు ఆయన తెలిపారు.

సోయా కొనుగోలు కేంద్రం ప్రారంభం


కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సీఈవో జనార్ధన్

జైనూర్(ఆసిఫాబాద్): మండల కేంద్రంలోని మార్కెట్ యార్డులో సోమవారం సోయా కొనుగోలు కేంద్రాన్ని పీఏసీఎస్ సీఈవో జనార్ధన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంటను అమ్మకానికి తీసుకొచ్చే రైతులు తమ వెంట పట్టా పాసుపుస్తకం, ఆధార్‌కార్డు, బ్యాంకు ఖాతా పుస్తకం వెంట తెచ్చుకోవాలని సూచించారు.

టికెట్ కేటాయింపులో మహిళలకు అన్యాయం

ఉట్నూర్‌రూరల్: కాంగ్రెస్ టికెట్ల కేటాయింపులో మహిళలకు అన్యాయం జరిగిందని ఉట్నూర్ జెడ్పీటీసీ చారులత రాథోడ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో మాట్లాడారు. ఉమ్మడి జిల్లాలో కొత్తగా పార్టీలో చేరిన వారికి టికెట్ కేటాయించడం సరికాదన్నారు. సీనియర్లను పక్కన పెట్టి, ఆర్థికంగా బలంగా ఉన్న వారికే టికెట్లు ఇచ్చారని ఆరోపించారు. సర్వేలను సైతం అధిష్టానం పట్టించుకోలేదన్నారు. త్వరలో తన కార్యచరణను ప్రకటిస్తానని తెలిపారు. నాయకులు చంద్రయ్య, ఇక్బాల్, పుర్కబాపురావు, ప్రభాకర్ పాల్గొన్నారు.

పకడ్బందీగా ఎన్నికల నియమావళి అమలు


తనిఖీ చేస్తున్న డీఎస్పీ వెంకటరమణ

రెబ్బెన(ఆసిఫాబాద్): జిల్లాలో ఎన్నికల నియమావళి పకడ్బందీగా అమలు చేస్తున్నామని డీఎస్పీ వెంకటరమణ తెలిపారు. మండలంలోని అంతర్ జిల్లా చెక్‌పోస్టును సోమవారం తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ వాహనాల తనిఖీ విషయంలో ఎవ్వరికీ మినహాయింపు లేదని, ప్రతీ వాహనాన్ని తప్పనిసరిగా తనిఖీ చేయాలని ఆదేశించారు. డబ్బు, మద్యం, ఓటర్లను ప్రలోభాలకు గురిచేసే వస్తువులపై ప్రత్యేక నిఘా పెట్టామని తెలిపారు. రూ.50వేలకు మించి తీసుకెళ్లే నగదుకు తప్పనిసరిగా అవసరమైన పత్రాలు చూపించాలని కోరారు.

రైతుల పక్షాన పోరాడి జైలుకెళ్లాం

- ఎమ్మెల్యే కోనేరు కోనప్ప


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోనప్ప

బెజ్జూర్: పోడు భూముల్లో అటవీ శాఖ అధికారులు జెండాలు పాతినప్పుడు అడ్డుపడి రైతుల పక్షాన పోరాడి జైలుకెళ్లిన కుటుంబం తమదని సిర్పూర్ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అన్నారు. మండల కేంద్రంలో సోమవారం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మండల కేంద్రంతో పాటు ఎలుకపెల్లి, చిన్నసిద్దాపూర్, పాపన్నపేట గ్రామాలకు చెందిన రైతులు ఏళ్లనాటి నుంచి సాగు చేసుకుంటున్న పోడు భూముల్లో అటవీ శాఖ అధికారులు జెండాలు పాతినప్పుడు రైతుల పక్షాన పోరాడామన్నారు. నియోజకవర్గంలో రోడ్లు, వంతెనలు, విద్యార్థులకు మధ్యాహ్న భోజనం, కోచింగ్ సెంటర్, కాగజ్‌నగర్ పట్టణంలో నిత్యాన్నదాన కేంద్రం, గర్భిణీ స్త్రీలకు పౌష్టికాహారం ఎన్నో సంక్షేమ పథకాలు తీసుకొచ్చిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరికలు..

మండల కేంద్రానికి చెందిన తాజొద్దీన్, అమీరొద్దీన్‌ల ఆధ్వర్యంలో ఆయా గ్రామాలకు చెందిన దాదాపు 300 మంది ఇతర పార్టీలకు చెందిన నాయకులు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ కృష్ణారావు, మార్కెట్ కమిటీ చైర్మన్ కాసం శ్రీనివాస్, జిల్లా రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు జగ్గాగౌడ్, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

కౌటాల: ఎన్నికల్లో ప్రజలు మరోసారి తనను ఆశీర్వదించాలని, సిర్పూర్‌ను మరింత అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అన్నారు. సోమవారం రాత్రి మండలంలోని వీర్దండి గ్రామంతో పాటు కౌటాలలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పలువురికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఎంపీపీ విశ్వనాథ్, సర్పంచులు రేణుక, దామోదర్, మౌనిశ్, నాయకులు పాల్గొన్నారు.

'కోనప్పతోనే అభివృద్ధి సాధ్యం'


ప్రచారం చేస్తున్న కోనేరు వంశీకృష్ణ

కౌటాల: కోనేరు కోనప్పతోనే సిర్పూర్ అభివృద్ధి సాధ్యమని కోనేరు చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు, ఎమ్మెల్యే తనయుడు కోనేరు వంశీకృష్ణ అన్నారు. కౌటాల వారసంతలో సోమవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గత 30 ఏళ్లుగా నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉండి కోనేరు కోనప్ప గెలిచినా, ఓడినా సేవ చేస్తున్నారని తెలిపారు. ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి కోనప్పను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఆయన వెంట ఎంపీపీ విశ్వనాథ్, డీసీఎంఎస్ వైస్ చైర్మన్ మాంతయ్య, పార్టీ మండలాధ్యక్షుడు ఆదే వసంత్‌రావు, సర్పంచులు మౌనిశ్, శ్రీనివాస్, కోఆప్షన్ సభ్యులు అజ్మత్, పార్టీ మండల యూత్ అధ్యక్షుడు రవీందర్‌గౌడ్, శైలజాగౌడ్, ప్రకాశ్, విలాస్‌గౌడ్, ఆగయ్య, తిరుపతి, గోపాల్, రాంచందర్, సంతోష్ పాల్గొన్నారు.

డంపింగ్‌యార్డును వేరే చోటుకు తరలించాలి


వినతిపత్రం అందజేస్తున్న శ్రీనివాస్ రావు

రెబ్బెన: గోలేటి టౌన్‌షిప్‌లోని డంపింగ్‌యార్డు నుంచి వెలువడుతున్న కాలుష్య పొగను వెంటనే నివారించాలని టీబీజీకేఎస్ బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు మల్రాజు శ్రీనివాస్‌రావు డిమాండ్ చేశారు. సోమవారం గోలేటిలోని జీఎం కార్యాలయంలో ఏరియా జనరల్ మేనేజర్ రవి ప్రసాద్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. శ్రీనివాస్ రావు మాట్లాడుతూ గోలేటి టౌన్‌షిప్‌లోని కార్మిక క్వార్టర్ల నుంచి సేకరిస్తున్న చెత్తను భీమన్న స్టేడియం సమీపంలో ఉన్న డంపింగ్‌యార్డుకు తరలిస్తూ నిప్పు పెడుతున్నారన్నారు. డంపింగ్ యార్డు నుంచి పొగ దట్టంగా వెలువుతుండటంతో సింగరేణి కార్మికులు, కార్మిక కుటుంబాలు, పరిసర గ్రామాల ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. వీలైనంత త్వరగా డంపింగ్‌యార్డును వేరే ప్రాంతానికి తరలించాలని, అప్పటి వరకు డంపింగ్‌యార్డు నుంచి పొగ రాకుండా నివారణ చర్యలు చేపట్టాలని కోరారు.

సిర్పూర్‌లో అభివృద్ధి శూన్యం


మాట్లాడుతున్న అర్షద్ హుస్సేన్

బెజ్జూర్: సిర్పూర్ నియోజకవర్గంలో అభివృద్ధి శూన్యమని, ఎక్కడ అభివృద్ధి చేశారో చూపాలని బీఎస్పీ రాష్ట్ర కార్యనిర్వాహక కమిటీ కార్యదర్శి అర్షద్ హుస్సేన్ సవాల్ విసిరారు. సోమవారం మండల కేంద్రంలోని ఆయన నివాసంలో విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికలు రావడంతో స్థానిక ఎమ్మెల్యే ప్రజలపై దొంగ ప్రేమ చూపిస్తున్నారని మండిపడ్డారు. ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ బహుజనులు ఏకమయ్యారని, ఇక కోనేరు ఆటలు చెల్లవన్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు లేండుగురే శ్యాంరావ్, నియోజకవర్గ ఇన్‌చార్జి దుర్గం మోతిరాం, బెజ్జూర్ సర్పంచ్ అన్వార్ హుస్సేన్, మండల అధ్యక్షుడు ఆత్రం సాయి, చిప్పకుర్తి దేవాజీ, నీకాడి మోహన్, నందయ్య, ఎల్కరి రమేశ్, రాందాష్ తదితరులు పాల్గొన్నారు.

అవినీతి లేని రంగాల్లోనే అభివృద్ధి


ప్రతిజ్ఞ చేస్తున్న జీఎం రవి ప్రసాద్, అధికారులు

రెబ్బెన: అవినీతి ఏ రంగంలోనైనా అభివృద్ధికి అడ్డంకిగా మారుతుందని అవినీతి లేని చోటనే అభివృద్ధి సాధ్యమవుతుందని బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ రవిప్రసాద్ అన్నారు. గోలేటిటౌన్‌షిప్‌లోని జీఎం కార్యాలయంలో సోమవారం విజిలెన్స్ వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. కార్యాలయ ఉద్యోగులతో కలిసి అవినీతికి వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేశారు. ప్రతి ఒక్కరూ నిజాయితీగా పని చేస్తూ సంస్థను మరింత వృద్ధిలోకి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌వోటూజీఎం నరేందర్, డీజీఎం (ఫైనాన్స్) రామారావు, డీజీఎం (సివిల్) సతీష్‌బాబు అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

గ్రామాల్లో బీఆర్ఎస్ ప్రచారం

జైనూర్: మండల కేంద్రంతో పాటు గ్రామగ్రామాన నాయకులు ప్రచారం ప్రారంభించారు. సోమవారం గోడప్రతులు, కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా నాయకులు బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో పాటు మేనిఫెస్టోపై ప్రజలకు అవగాహన కల్పించారు. జామిని మాజీ సర్పంచి మడావి నాగోరావుతో కలిసి గోడప్రతులు ఆవిష్కరించారు.

లింగాపూర్: మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో సోమవారం పార్టీకి సంబంధించిన పోస్టర్లు ఆవిష్కరించారు. ఈసందర్భంగా బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఆత్రం అనిల్‌కుమార్ మాట్లాడుతూ తమ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అందిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల రైతుబంధు సమితి అధ్యక్షుడు జాదవ్ రమేశ్, ఎంపీపీ సవీతప్రేమ్, జెడ్పీటీసీ అడే రకాబాయి, జాదవ్ గణపత్, జాటోత్ రాహుల్ తదితరులు ఉన్నారు.